కథా నిలయం
శ్రీకాకుళం

తప్పెవరిది?

"అమ్మా! డబ్బులీయె, ఇయాల పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖరిరోజే, ఇయాల యిస్తానన్నావుగా, బేగి యియ్యి" స్కూలు యూనిఫాం వేసుకుని చిన్న అద్దం ముందు నిలబడి తలదువ్వుకుంటూ అన్నాడు సురేష్.

వీధి గుమ్మం తుడిచి కల్లాపిజల్లి రెండు ముగ్గు గీతలు వేసి, అంట్ల గిన్నెలు తోముకుంటున్న వరమ్మ "రెండు నిమిషాలు ఆగరా నాయనా, ఈ గిన్నెలు రెండు కడిగేసి యిస్తాను". తోమిన గిన్నెలు లోపలికి తీసికెళ్లి పోయి దగ్గిర పెట్టి కొంగుతో చేతులు తుడుచుకుని ట్రంకుపెట్టె దగ్గరికెళ్లి మూత తీసింది. బట్టల కింద దాచిన చిన్నపర్సు చేతికి అందలేదు. గబగబ బట్టలు లాగి కిందామీదా వెతికి 'సురేషా' కేకపెడ్తూ పెట్టె బోర్లించి వెతుకుతూ, 'అరేయ్ డబ్బులేవిరా, పెట్టిలో పెట్టా గదరా నిన్న సాయంత్రం, ఏవిరా అగపడవు' ఏడుపు గొంతుతో అంటూ కొడుకు వంక వెర్రిమొకమేసుకు చూస్తూ అంది. సురేషు తెల్లపోయాడు. 'ఈ పెట్టెలోనే పెట్టావా?' తనూ వెతుకుతూ అన్నాడు. 'నిన్న సునీతమ్మని బతిమిలాడి అడ్వాన్స్ అట్టుకొచ్చి ఇదిగోరా ఈ చిన్న పర్సులో ఎట్టి బట్టల అడుగున దాచి పెట్టారా...' ఏడుస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయి శివంగిలా ఒక్క ఒదుటున గుడిసె బయట అరుగుమీద నులకమంచంలో పడుకున్న మొగుడి దగ్గరకెళ్లి కుదిపి కుదిపి లేపి, లాగి పడేసింది కింద. 'దొంగ సచ్చినోడా! ఆడదాన్ని కట్టబడి పాచిపన్లు చేసి నాలుగు డబ్బులు తెచ్చి పిల్లాడిని సదివించుకుంటున్నారా... నీ జిమ్మడ, పరీచ్చకని దాచిన డబ్బులట్టికెళ్లి తాగడానికి సేతులు ఎట్టా వచ్చాయిరా... ' మొగుడ్ని దబదబ బాది, తన తల బాదుకుని 'సావనైనా సావవు... పాపిష్టోడా...' వరమ్మ కింద కూలబడి మొగుడి

జుట్టు పట్టుకొని గుంజి తిట్లకి లంకించుకుంది. మత్తులో పడున్న నర్సయ్య కళ్లిప్పాడు. 'ఏటే, పొద్దుగాల ఏందే నీ గోల, ఏటే శివాలెత్తిందా, నన్నే కొడతావా?' తూలిపోతూ లేచి నిలబడి వరమ్మ జుత్తు పట్టుకుని వంచి వీపు మీద దభిదభి గుద్దాడు. 'నన్నే కొడతావే' హూంకరించాడు. వరమ్మ భద్రకాళిలా లేచి జుత్తు విడిపించుకుని 'ఏవిరా, డబ్బు లేయిరా, పిల్లాడి పరీచ్చ కోసం తెచ్చి పెట్టా దొంగనాయాలా, పెట్టెలో డబ్బేమయింది... నా డబ్బు నాకీయి' నర్సయ్య చేయి గుంజుతూ అరిచింది. నర్సయ్య విసురుగా వరమ్మ చేయితీసేసి 'ఏ డబ్బులు... నాకేటి తెల్వదు... నే తీయలేదు' కోపంగా అన్నాడు. 'తీయకపోతే పీకలదాకా తాగడానికి డబ్బులేడనించి వచ్చాయిరా. నిన్న సాయంకాలం డబ్బుతెచ్చి కూరల దుకాణానికి ఎల్లగా సూచి కాజేసి పీకల దాకా తాగొచ్చినావు, పిల్లగాడి పరీచ్చకి ఎలా కట్టాలి...' ఏడుస్తూ అంది. సురేష బిక్కమొగం పెట్టుకొని 'అమ్మా, మరెట్టాగే, యియాల ఆఖరిరోజు డబ్బు కట్టడానికి. లేకపోతే పరీచ్చకి కూర్చోనీయరే... ఏడుపు గొంతుతో అన్నాడు. 'ఏం సెయ్యనురా నాయనా, మాష్టరుగారికి సెప్పరా... రేపు కడ్తానని.. ఎలాగైనా పట్టుకొచ్చి యిస్తారా...'

'మాస్టారేం సేస్తారు, ఆఫీసులో కట్టాలి, ఆఫీసులో వప్పుకోరే... ఫైనుతో కట్టే అఖరి రోజు ఇయాల' అంటూ నర్సయ్య వంక కోపంగా చూసి 'నీవియవు డబ్బులు, అమ్మ కష్టపడి పనిచేసి తెచ్చింది కాజేస్తావా? తూ.. నే పరీక్ష ఎలా రాయాలి..' అన్నాడు చీదరింపుగా. 'పోరా, ఎదవా, నీవీ పరీచ్చరాసి కలక్టేరువయిపోతావా ఏందిరా, పదో క్లాసు చదివితే ఏం ఉద్యోగాలు రావు. సుబ్రంగా మేస్త్రి పని నేర్చుకో అని సెపితే ఇన్నావా, మీ అమ్మకి కొడుకును కలక్టేరు చెయ్యాలని ఆశ. దాని మాట యినుకున్నావంటే రెంటికి చెడ్డ రేవడిరా నీ బతుకు, రేపటి కాడనుండి నా ఎంటరా పని నేర్చుకుందుగాని...'

'నోరుముయ్యరా తాగుబోతు నాయాలా... సుబ్రంగా సదుకునే పిల్లాడిని, ఆడకూతురు కట్టపడి సదివిస్తుందనే గానంలేకుండా పిల్లాడి పరీచ్చ డబ్బులట్టుకుపోయి తాగినోడివి, నీవసలు మడిసివట్రా, ఏం జన్మరా, ఎందులో నన్నా పడిసస్తే బతికిపోతాను' మెటికలు విరిచి శాపనార్థాలు పెడ్తూ తలబాదుకుంది. 'అమ్మా, మరెట్టాగే, పరీక్ష రాయనీయరే...' ఏడుపు గొంతుతో అన్నాడు. 'ఈ పూటకి ఏదో చెప్పరా నాయనా, రేపు తెచ్చిస్తాగా, మా నాయన ఎల్లరా' బతిమిలాడి కొడుకుని పంపింది వరమ్మ.

* * * * * *

'సురేష్... ఆగరా... ఏట్రా పిలుస్తుంటే పలకవేమిట్రా...' వగరుస్తూ వచ్చాడు కిట్టప్ప. 'ఏట్రా ఏటయింది... ఎందుకురా ఏడుస్తున్నావు' తనని చూసి చొక్కా చేత్తో కళ్లు తుడుచుకుంటున్న సురేష్‌ని చూసి అన్నాడు. ఏం లేదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు. అయినా కళ్ళనీళ్ళు మళ్లీ నిండాయి. ఏవయింది. మీ అయ్య తిట్టాడా, కొట్టాడా...' ఆరాటంగా అడిగాడు. 'నా పరీక్ష ఫీజు దొంగతనంగా తీసుకుపోయి తాగేశాడురా మా నాన్న, పాపం మా అమ్మ ఎవరినో బతిమిలాడి తెచ్చి పెట్టెలో దాచి పెట్టింది. పట్టుకుపోయాడు. ఇయాల ఆఖరిరోజు ఫీజు కట్టడానికి, నేను పరీక్షరాయడానికి లేదురా. మా అమ్మ ఎలాగన్నా రేపు తెచ్చిస్తానంది. సార్ ఒప్పుకుంటారో లేదో' దిగులుగా చెప్పుకొచ్చాడు.

'అరెయ్.. ఏడవకురా... నాదగ్గర డబ్బుంది, నేనిస్తా... యియాల కట్టేయ్, రేపు మీ అమ్మ తెచ్చిచ్చాక ఇద్దూగానీలే...' బుజం మీద చెయ్యేసాడు. 'నీకాడ ఎక్కడిదిరా అంత డబ్బు' ఆశ్చర్యంగా చూశాడు సురేష్... 'మీ అయ్య మా అయ్య కథ ఒకటే గదరా ... ఇద్దరూ తాగి తందనాలు ఆడతారు డబ్బు లట్టుకుపోయి...' అనుమానంగా చూశాడు. 'పదరా, అయన్నీ తరువాత. స్కూలు టైమయింది. ముందు ఫీజు కట్టేయ్' సురేష్ చేయి పట్టి లాక్కెళ్ళాడు కిట్టప్ప.

* * * * * *

'కిట్టప్పా, థ్యాంక్స్‌రా, నీవిచ్చావు గనక టైముకి ఫీజు కట్టేసాను, లేకపోతే ఈ ఏడాది పోయేది – అమ్మ యిచ్చాక రేపు ఇచ్చేస్తారా డబ్బు' 'పర్లేదు లేరా, యిద్దూగాని' నిర్లక్ష్యంగా అన్నాడు.

'కిట్టప్పా, నీదగ్గిర అంత డబ్బెక్కడిదిరా... మీ అయ్య కూడా ఇంట్లో డబ్బీయడు. తాగి తగలేస్తాడు గదరా' అమాయకంగా అడిగాడు సురేష్.

'డబ్బుదేం ఉందిరా అదే వస్తది. తెలివి వుండాలి కాస్త సంపాదించడానికి' తలెగరేసి గర్వంగా అన్నాడు.

'సంపాయించావా... ఎలారా ... ప్లీజ్ నాకూ చెప్పరా... మా అమ్మ చాలా కష్ట పడుతుంది డబ్బుకి, చెప్పరా' ఆశగా అడిగాడు.

'పోరా, నీవుత్త పిరికి గొడ్డువి, ధైర్యం వుండాలిరా, హుషారుండాలి సంపాదించ డానికి' కాలరెగరేస్తూ ఫోజు కొట్టాడు.

'ప్లీజ్, నేనూ చేస్తారా. ఏంపనో చెబితే నేనూ బాగా చేస్తా... నాకాడ బట్టలన్నీ

చిరిగిపోయి, జోళ్లు తెగిపోయాయి. అమ్మదగ్గర డబ్బు తినడానికే చాలదు. అయ్య రూపాయివ్వడు సరిగదా అమ్మని తన్ని పట్టుకుపోతాడు. నీకు తెలుసుగదరా ఇంటి సంగతి... మీ అయ్యా అంతే గదా...'

'అందుకే గదరా నేను సంపాదిస్తున్నా... అమ్మకి సాయం చేస్తున్నా.'

'మరి నాకు చెప్పరా...' ఆశగా అడిగాడు.

'అరేయ్ ఇది అందరూ చేసేది కాదు, రగస్యంగా సెయ్యాలి, ఎవరికీ చెప్పేది కాదు. నీవల్ల కాదులే...'

భయంగా చూశాడు సురేష్ – 'మరి నీవెలా సేస్తన్నావు – మీ అమ్మ నిన్ను అడగదా డబ్బెక్కడదని' అనుమానంగా చూశాడు.

'ఏంటిరా అడిగేది... అడిగితే ఏదో సెపుతా, తిండికి లేనోళ్లకి డబ్బు కళ్లబడగానే నోరు మూత పడ్తది' నిర్లక్ష్యంగా అన్నాడు.

'అరేయ్, ఈ బూట్లూ, వాచి, మంచి బట్టలు అన్నీ చూసి అడగరా ఎవరూ –'

'అమ్మ మొదట్లో నిలేసింది – నే గట్టిగా చెప్పా ఏదన్నా అంటే ఇంట్లోంచి పోతాననగానే ఇంకేటంటది? అయ్య అయితే ఓ నూరు రూపాయలు చేతిలో పడగానే నోరు మూసుకు సల్లగా జారుకుంటాడు...'

'అరే, ఆ పనేటి సెప్పరా, సేయగలనో లేదో సూస్తా... వరేయ్ ఈ పరీక్షలయిపోతే కాలేజీలో సదవాలనుంది. డబ్బు కావాలి గదరా... నేకపోతే ఏదన్నా ఉద్యోగం సూసుకోవాలిరా...'

'ఏట్రా నీ పదోక్లాసు సదూకి ఏం ఉద్యోగం సేస్తావురా' హేళనగా అన్నాడు.

'మా అమ్మ పనిచేసే బ్యాంకు మేనేజరు గారిని అమ్మ బతిమిలాడితే అటెండరు ఉద్యోగం యిప్పిస్తాలే అన్నాడట.'

'పోరా అటెండరు అంటే ఏంట్రా, బంట్రోతు ఉద్యోగంగా... ఏటొస్తుందిరా...' హేళనగా నవ్వాడు.

'మరందుకే చెప్పరా... నీవు చేసే పని నాకూ యిప్పించరా'.

'సరేలే, రేపు ఓ చోటికి తీసికెడతాలే, వరేయ్, ఈ సంగతి ఎక్కడా నోరిప్పావంటే అంతే, అసలు మీ అమ్మకే కాదు ఎవరి దగ్గర మాట్లాడవద్దు. అలా అయితేనే నే తీసుకుపోతా' బెదిరిస్తూ అన్నాడు. సురేష్ తలూపాడు.

* * * * * *

వారం పదిరోజుల తరువాత, ఆరోజు వంట్లో బాగుండక జ్వరం మాత్ర వేసుకుని వరమ్మ పడుకుంది. పదకొండు గంటలవేళ పక్కింటి అవ్వ వచ్చి లేపి గాభరాగా 'వరాలు... వరాలు... పోలీసులు మీ సురేష్‌ని పట్టుకుని లాక్కొచ్చారే... నిన్నడుగుతుండరు. బయటికి రాయే బేగె...' ఒగరుస్తూ భయంగా అంది. వరమ్మ కళ్లిప్పి... అవ్వ అన్నది అర్థం కాక అయోమయంగా చూసింది. 'పోలీసులే సురేష్‌ని పట్టుకుని వచ్చారు...' మళ్లీ అంది. వరమ్మ దిగ్గున లేచి, బయటికి ఒక్క ఉదుటున వచ్చింది. ఒక పోలీసు సురేష్ చేతికి బేడీలు వేసి పట్టుకుంటే ఇనస్పెక్టరు లాఠి ఊపుతూ వరమ్మ బయటికి రాగానే 'వీడు నీకొడుకేనా?' అడిగాడు అధికారికంగా – వరమ్మ బిక్కచచ్చిపోయి తలూపుతూ 'ఏటిబాబు ఏటయింది... యీడేం సేసినాడు... మీరెందుకు అట్టుకొచ్చారు, సురేషూ ఏటయిందిరా... ఏం చేశావురా...' తల దించుకుని ఏడుస్తున్న కొడుకు దగ్గరికి వెళ్లి గాభరాగా అడిగింది. "బాబూ ఇన్‌స్పెక్టరు బాబూ, ఈడేం సేసాడు బాబూ ఎందుకు పట్టుకున్నారు... ఏటిరా సురేషూ చెప్పవేందిరా...' కొడుకు భుజాలు పట్టుకు గుంజుతూ అడిగింది. 'నాకేటి తెలియదే అమ్మా... నేనేం చెయ్యనేదే' అన్నాడు సురేష్.

'నోరు మూయరా రాస్కెల్, ఏం చెయ్యలేదట... ఏం చెయ్యకపోతే నిన్ను బేడీలేసి తీసుకురావడం సరదాకి అనుకున్నావా' లాఠీతో సురేష్ గడ్డం ఎత్తి కఠినంగా అన్నాడు.

'ఏటి బాబూ దొంగతనం సేసాడా, స్కూల్లో ఏదన్నా దొంగిలించాడా సెప్పండి బాబూ' దండం పెడుతూ ఏడుపు గొంతుతో అంది. 'చిన్న దొంగతనం అయితే రెండు తగిలించి భయపెట్టి వదిలేసేవారం... నీ కొడుకు పెద్ద కేడీ అయిపోయాడు. డ్రగ్గులు సప్లయ్ చేసే బ్రోకరు అయిపోయాడు...' హేళనగా అన్నాడు. వరమ్మకి ఏం అర్థం కాక తెల్లపోయి చూసింది. 'ఏటలా చూస్తావు... అర్థం కాలేదా? నీ కొడుకు మత్తుమందులు సప్లయ్ చేస్తున్నాడు, డబ్బు లార్జిస్తున్నాడు.... నీకు తెలవకుండానే వుందా? నీ కొడుకు నీకు డబ్బులు పట్టుకొచ్చి ఇవ్వడం లేదా... చెప్పరా వెధవా.. పట్టుమని పదహారేళ్ళు లేవు, డ్రగ్గ రాకెట్‌లో చేరిపోయి పనిచేస్తున్నావా? ఎప్పటినుంచి చేస్తున్నావు చెప్పరా రాస్కెల్... నోరిప్పు... లేదంటే మక్కెలిరగదంతా, ఏవమ్మా... కొడుకు స్కూలుకెడుతున్నాడో... మత్తుమందులు సప్లయ్ చేస్తూ తిరుగుతున్నాడో చూసుకోవద్దా... కొడుకు డబ్బులార్జించి తెస్తున్నాడని సంబరపడి గమ్మునూరుకున్నావా... పిల్లాడి దగ్గర డబ్బు లెక్కడినించి వస్తున్నాయని అడగద్దా... ఇద్దరూ పదండి పోలీస్ స్టేషన్‌కి.. అక్కడ చెబుదురుగాని కథలు – పద

జేపెక్కండి. "బాబూ, ఇన్‌స్పెక్టరు బాబూ మీరేటంటున్నారు. నా కొడుకు మత్తు మందులు ఇవ్వడమేంటీ, ఆడు స్కూల్లో సదూతాడు. మేష్టర్లందరూ చెపుతారు అడగండి కావలిస్తే, గాని నీతిలేని పనులు సేసేవోళ్లంగాదు, సురేష్ మంచి కుర్రాడు, ఆడికి ఆ తాగుబోతు తండ్రి బుద్ధులు రాలేదు, కష్టపడి సదూకుంటున్నాడు. మీరెవరనుకుని యీడ్ని పట్టుకున్నారో" గట్టిగా అంది.

'అలాగ... ఇన్నాళ్ళు సక్కా సదివేడేమో.. డబ్బు రుచి మరిగి దందాలోకి దిగాడు. స్కూలు బ్యాగులో పెట్టుకుని మత్తుమందు పేకట్లు ఇచ్చిరమ్మన్నచోటికి చేర్చి డబ్బు తీసుకుంటున్నాడు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. చెప్పరా.. ఎంత డబ్బిస్తారురా పేకట్టు యిచ్చినందుకు.. ప్యాంట్ జేబులో చెయ్యిపెట్టి రెండొందల రూపాయల నోట్లు తీసి వరమ్మ కళ్లముందు ఆడించాడు. వరమ్మ అయోమయంగా చూసింది. తరువాత సురేష్ వంక అపనమ్మకంగా చూసింది. 'ఏటిరా... ఈ బాబు సెప్పింది నిజమా...' అపనమ్మకంగా, అయోమయంగా అడిగింది.

సురేష్ భోరున ఏడవడం మొదలుపెట్టాడు. 'నాకు తెలవదే అమ్మా – ఒక పేకట్టు ఆళ్ళు చెప్పిన చోట యిస్తే వంద, రెండొందలు ఇస్తామన్నారు. ఆ పేకట్లో ఏటుందో నాకు తెలవదు...' అమాయకంగా అన్నాడు. వరమ్మ తెల్లబోతూ చూసింది. 'ఎవరొచ్చి ఇచ్చారు పేకట్టు, ఎక్కడిమ్మన్నారు..' ఆరాటంగా అడిగాడు ఇన్‌స్పెక్టరు. 'అసలు నిన్ను వాళ్లెలా తీసుకున్నారు. నిన్ను వాళ్లదగ్గర కెవరు తీసుకెళ్లారు'. సురేష్ బెదురుగా చూశాడు. 'ఆళ్లెవరో నాకు తెలవదు – నాకాడికొచ్చి ఒక పేకట్టు యిచ్చి – ఆ కిళ్లీకొట్టుకాడ ఇవ్వాలి – యిచ్చే ముందు 'స్వీట్ సిక్స్‌టీన్' అనాలి – అపుడా కొట్టువాడు పేకట్టు తీసుకుని డబ్బిస్తాడు. నీకు పేకట్టు యిచ్చే వాడొచ్చి నీ వయసెంత అంటే 'స్వీట్ సిక్స్‌టీన్' అనాలి. అది నీ కోడ్ వర్డ్. అది సెపితేనే పేకట్టు యిస్తారు. డబ్బిస్తారు. ఈ కోడ్ వర్డ్ ఎవరికీ చెప్పకూడదు. చెపితే తల తెగుతుంది. పోలీసులు పట్టుకెళ్లి జైల్ల పెడతారు. నీ దగ్గరికొచ్చి నీ వయసెంత అంటే ఆ మాట గుర్తు చెప్పాలి.."

'పేకట్లో ఏటుంది అని నీవడగనేదా?' ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

'అడిగా... అది నీకనవసరం. తెల్సుకోనక్కరలేదు' అన్నారు. బ్రౌన్ పేపరు నాలుగు పుస్తకాలు కలిపిన ప్యాకెట్టు సైజు యిచ్చి రావడం తప్ప నోరు విప్పకూడదు. ఎవరితోనయినా చెపితే చస్తావు అని బెదిరించారు. ఆ పాకెట్టులో ఏటుందో నాకు తెలీదు. చిన్న పని చేస్తే రెండొందలిస్తామన్నారు అని వప్పుకున్నా. వెళ్లి కొట్టుకాడ

ఎవరూ లేనపుడు, ఎవరూ చూడనపుడు గబుక్కున ఇవ్వాలి... ఎవరన్నా వస్తే చాక్లెట్టు ఒకటి కొనాలి. ఎవరూ ఏం అనుమాన పడకుండా... కిళ్ళీ కొట్టువాడు అడిగిన కోడ్ వర్డ్ తప్ప మరేం మాట్లాడకుండా వెళ్ళాలి. డబ్బులు తీసుకోడం కూడా ఎవరూ చూడనపుడు చటుక్కున తీసి జేబులో పెట్టుకోవాలి అని చెప్పారు' వెక్కుతూ అన్నాడు.

'ఇదంతా ఎవరు చెప్పారు - అసలు వాళ్లదగ్గరికి నిన్నెవరు తీసుకెళ్లారు...'

సురేష్ ఇబ్బందిగా చూశాడు... మాట్లాడలేదు. 'చెప్పు' గద్దించాడు ఇన్‌స్పెక్టర్.

'చెబితే సంపుతాం అన్నారు' బెదురుగా చూశాడు. 'మరేం ఫరవాలేదు. నిన్నెవరూ ఏం చేయలేరు. పోలీసులు దగ్గరుండగా ఎవరేం చేయలేరు...' వరమ్మ ఏడుస్తూ 'సెప్పరా ఇదంతా ఎప్పుడు జరిగిందిరా... ఎవరు సెప్పారు యిదంతా నీకు.'

'కిట్టప్ప .. ఆడు సెప్పాడు. డబ్బు సంపాయించేందుకు ఉపాయం. స్కూలు ఫీజు కట్టడానికి ఆ రోజు డబ్బిచ్చినప్పుడు అడిగితే సెప్పాడు. ఇంట్లో డబ్బు నేదు. అయ్య డబ్బీయడు. నీవు తెచ్చేది మనకు సాలడం లేదు - నేనూ సంపాదిద్దామని ఆశపడ్డా.'

'కిట్టప్పా.. వాడెవడు, నీ దోస్తా... ఎక్కడుంటాడు'

'మా ఇంటిదగ్గరే సాబ్... ఆడు ఈ మధ్య సెడిపోయాడు. డబ్బు లట్టుకొచ్చి యిట్టం వచ్చినట్టు ఖర్చుపెడ్తున్నడు. ఆడి అమ్మ అడిగితే కథలు సెపుతున్నడు. బూట్లు, వాచి, మంచి బట్టలేసు దర్జాగా తిరగతన్నడు. ఆడితో స్నేహం వద్దని సెప్పా యీడికి. ఆ ఎదవ ఈడ్నీ ముంచాడు. నా కొంపదీశాడు' ఏడుస్తూ అంది వరమ్మ.

'యీడీ మధ్య ఓ నూరు రూపాయలట్టకొచ్చి యిస్తే ఎంటనే అడిగితే ఎవడో డబ్బున్న యీడితో సదివేవాడు నోట్సు రాసిపెడితే యిచ్చాడన్నాడు. ఇంకోరోజు యింటికి సామాను పట్టుకొచ్చాడు... దుకానంలో సాయంత్రం పద్దులు రాస్తే యిచ్చారన్నారు. ఏదీ నా బాబు నా కట్టం సూడలేక కట్టబడి సంపాయించి తెచ్చాడనుకున్నాను. అంతేబాబు అంతకంటే యింకేం డబ్బులు నాకీయలేదు.'

'ఏరా, ఎన్నాళ్ళుగా చేస్తున్నావు... ఎన్నిసార్లు యిచ్చావు పేకట్లు?' 'రెండేసార్లు సార్.... మూడోసారి 'మీ పోలీసులొచ్చి పట్టుకున్నారు...' గిల్టీగా చూశాడు.

'ఈడు కొత్తగా మొదలెట్టాడు... అనుభవంలేక దొరికిపోయాడు, ఈడియట్.'

'బాబూ... మీకెలా దొరికాడు యీడు' వరమ్మ భయంగా అడిగింది.

'ఈమధ్య ఈ మందుల దందా జోరుగా సాగుతోంది అని పోలీసులు నిఘా ఎక్కువ చేశారు. ఈడు కిల్లీ కొట్టుకాడ బెదురు చూపులు చూస్తూ తచ్చాడుతుంటే మఫ్టీలో ఉన్న పోలీసు కంటపడ్డాడు. ఆడికి అనుమానం వచ్చి దూరంవెళ్లి చాటుగా నిలబడి చూస్తుంటే వీడు ఎవరూ లేకుండా చూసి, పేకట్టు అందించి చటుక్కున డబ్బులు జేబులో కుక్కుకోవడం చూసి అనుమానం వచ్చి గబగబ వెళ్ళి పట్టుకున్నాడు... ఆ కిల్లీ కొట్టువాడు ఎవరో వచ్చి పేకట్టు తీసికెడతారని బుకాయించాడు. వాడ్ని తన్ని స్టేషన్‌కి ఇద్దరినీ లాక్కొచ్చాడు... ఈ దందాలో నీ వాటా ఉందా అని తేల్చుకోడానికి యీడ్ని ఇంటికి తీసుకొచ్చా... పద, నీవూ జీపెక్కు పోలీసు స్టేషనులో జరిగిందంతా చెప్పాలి... ఆ కిట్టుగాడిని పట్టుకుంటాం.. వీళ్ళ ద్వారా అసలు వాళ్లెవరో కనిపెట్టాలి. పదండి జీపెక్కండి' ఇన్‌స్పెక్టర్ కదిలాడు.

గుమ్మంలో పోలీసులని చూసి దొంగచూపులు చూస్తూ భయంగా నక్కాడు నర్సయ్య ఇంట్లోకి రాకుండా. మొగుడు కంట ప డగానే వరమ్మ శివాలెత్తిందానిలా ముందుకు ఉరికి మొగుడు జుత్తు లంకించుకుని "సూడరా, సూడు నీవల్ల నీ తాగుడు వల్ల నీ కొడుకు జైలుకి ఎలతన్నాడు... బిడ్డ మొగం సూడరా... ఆడి బతుకులో నిప్పులు పోశావురా... థూ... ఏం జన్మరా... సావరా ఎందులోనన్నాపడి...' అలుపువచ్చేవరకు తిట్టింది వగురుస్తూ... 'బాబూ! ఇన్‌స్పెక్టరు బాబూ, ఈ పాలికి దయసూడు బాబు. ఇదిగో ఇలాంటి తాగుబోతు ఎదవలు మొగుళ్లయితే నాలాంటి ఆడోళ్లు ఏం చేస్తారు. ఈడిలాంటి బిడ్డలు ఏమవుతారు. డబ్బులొస్తాయని ఆశపడి పాడు పనులకి దిగితే అన్నెంపున్నెం ఎరగని యీడిదా తప్పు. ఈ తాగుబోతు సచ్చినోడిని జైల్లో ఏయండి బాబూ బతికిపోతాను' – తలబాదుకుంటూ ఏడ్చింది. ఇన్‌స్పెక్టరు సానుభూతిగా చూశాడు. నాలుగు డబ్బులొస్తాయని ఆశగా తెలిసీ తెలియకుండా ఇలాంటి వాటిలో ఇరుక్కుని, ఈ దంధాలో పీకలదాకా కూరుకుపోయిన వాళ్లెందరినో పట్టుకుంటారు. కాని ఏం లాభం.. అసలు వాళ్లు బయటపడరు. చిన్న చేపలే వలలో పడతాయి అన్నదీ పోలీసులకీ తెలుసు. కాని న్యాయం, చట్టం... వీటికి అతీతంగా తనలాంటి వాళ్ళేం చేయగలరు. 'పదమ్మా, సెప్పేదేదో పోలీసు స్టేషను దగ్గర పెద్దసారుకు జెప్పు, అయ్యా మొదటిసారని చెప్పి వేడుకో... ఏం జరుగుతుందో చూద్దాం. పద జీపెక్కి..పదరా...' ఈసారి ఇన్‌స్పెక్టర్ గొంతులో కాఠిన్యత స్థానే సానుభూతి కనపించింది. ఇలాంటి పిల్లలు ఎందరో బలి అయిపోతున్నారన్న బాధా వుంది ఆ గొంతులో.

(జయంతి, ఏప్రిల్ – జూన్ 2010)